“మర్యాదగా రేటెంతో చెప్పు” అన్నాడు మధుకర్ బేస్ వాయిస్‌లో గంభీరంగా.

“పాతిక. ఏం కొంటావా? చెప్పు. పాతిక అంటే పాతిక రూపాయలు. పాతిక వేలో అనుకొనేవు. పాతిక లక్షలు. ఎక్కిన నిషా రేటు చెప్పగానే దిగిపోయిందా?” హేళనగా అన్నాడు మేనేజర్.

అప్పటికే బార్‌లో వున్న మిగతా కస్టమర్స్ అక్కడికి చేరుకొని గుమికూడారు.

“ఆఫ్ట్రాల్ పాతిక లక్షలు.... వాటికి ఐదులక్షలు నా టిప్ కలుపుకో. టోటల్‌గా ముప్పై లక్షలు. ఆర్యూ రడీ?” మధుకర్ పెద్దగా, అరుస్తున్నట్లుగా అన్నాడు.

“రడీ...... పేపర్స్ తెప్పించనా?” కవ్వింపుగా అన్నాడు మేనేజర్.

“పేపర్స్ ఎందుకు?” మధుకర్ ప్రశ్నించాడు.

“ఏమో..... మాట తప్పితే లేదా నిషా దిగాక అమ్మో అంటే.... నే నేమన్నానో నాకు గుర్తు లేదంటే?” అంటూ తన వాదనను నలుగురితో సమర్థింపజేసుకోవటం కోసం కస్టమర్స్ వేపు చూపుల్ని మరల్చుతూ అన్నాడు మేనేజర్.

“అవునవును రాతకోతలుండాలి. పేపర్స్ తెప్పించండి” అన్నారు అప్పటికే నిషా తలకెక్కి ఉన్న కొందరు కస్టమర్స్.... జస్ట్‌ఫర్ థ్రిల్ కోసం.

మధుకర్ అలాగే చేసుకో అన్నట్లు నిర్లక్ష్యంగా సంజ్ఞ చేశాడు.

సందర్భం, సంఘర్షణ రక్తి కట్టింది.

చూసేవారికి థ్రిల్లింగ్ అంచుకు చేరుకున్నట్లుగా ఉంది. అప్పుడిక..... అసలు వ్యక్తులు ఏ కారణం చేతనైనా వెనక్కి తగ్గే ప్రయత్నం చేసినా ప్రక్కనున్నవాళ్ళు ఊరుకునేలా లేరు.

పౌరుషం, ఆత్మాభిమానం, అభిజాత్యం, అహం, పొగరు మనిషిని ఎక్కడికైనా తీసుకువెళ్తాయి. పర్యవసానాలు  ఆ స్థితిలో స్ఫురణకు రావు. వస్తే మానవ జీవితంలో తరచూ రక్తి కట్టే నాటకీయతకి స్థానం ఎక్కడుంటుంది?

నిమిషాల్లో స్టాంప్ పేపర్స్ వచ్చాయి.

లాయర్స్ వచ్చారు.

రాత కోతలయిపోయాయి.

వాటిమీద సంతకాలు చేసి పేపర్స్‌ని మేనేజర్ ముఖం మీదకు విసిరికొట్టాడు మధుకర్ .

తుఫాన్ వెలిసినట్లయింది.

థ్రిల్‌ని అనుభవిస్తున్న కష్టమర్స్ కొందరు సాక్షి సంతకాలు చేశారు.

ఆ నిజాన్ని ఇంకా నమ్మలేకపోతున్నాడు మేనేజర్.

మధుకర్, మూర్తి కస్టమర్స్ వేపు విజయగర్వంతో చూస్తుండగా.. మేనేజర్ దిగ్భ్రాంతినుంచి తేరుకున్నాడు.

నిమిషాల్లో, అంతా.... ఇదంతా కళ్ళముందే జరిగింది.

ఇదసలు నిజమేనా?

తన చేతిలో ఉన్న స్టాంప్ పేపర్స్ ముప్పై లక్షలకు సంబంధించిన డీల్ పేపర్సేనా? చిత్తు కాగితాలా?! ఎక్కడో కర్నాటకలో పశ్చిమ పర్వత శ్రేణువుల్లో, మడికేరీలో ఉన్న యువతి ఇక్కడ దీల్‌కి ఎలా సూత్రాధారి కాగలిగింది? ఇక్కడి పరిస్థితుల్ని సరీగ్గా ఎలా అంచనా వేయగలిగింది......? ఆమె వయస్సు మహా ఉంటే ఇరవై ఒకటి, లేక ఇరవై రెండు?!!

మధుకర్ ఆమెకి తెలుసా?

తెలీకపోయినా, ఇన్‌జెనరల్ అలాగే రియాక్ట్ అవ్వొచ్చని ఊహించిందా? అంతా... అయోమయంగా ఉంది. ఆ రాత్రి గడిచిపోయింది.... ఆలోచనలతో........ ఉద్రిక్తతలతో.... అనుమానాలతో గడిచిపోయింది.

మరుసటిరోజు ఉదయం... 7.15 ఎ. ఎమ్.

బార్‌ని అమ్మినట్లు మడికేరీలో ఉన్న మహతికి తెలిసిపోయింది.

మరుక్షణం తనతోటి స్టూడెంట్స్‌ని అక్కడే వదిలేసి బెంగుళూరు బస్ ఎక్కేసింది. ఆమెకిప్పుడు తను నిర్దేశించుకున్న లక్ష్యంవేపే సాగిపోతున్న నమ్మకం కలిగింది.

*　　　　*　　　　*　　　　*

7.30 ఎ.ఎమ్.

మధుకర్ బెడ్‌రూమ్‌లో ఫోన్ రింగయింది.

బద్ధకంగా అలాగే బెడ్‌మీద పడుకొని ఉన్న మధుకర్ విసుగ్గా ఫోనందుకున్నాడు.

“నేను. మధువన్ బార్ అండ్ రెస్టారెంట్ మేనేజర్‌ని మాట్లాడుతున్నాను. రాత్రే విషయం గుర్తుందా? మర్చిపోయారా?”

“నువ్వింకా నా బార్‌లోనే ఉన్నావా? మా వాళ్ళు వచ్చి నీ ఉద్యోగం పీకేయలేదా?”

“వ్వాట్!” ఫోన్‌లో మేనేజర్ ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ అన్నాడు.

“ఎస్. ఇప్పుడది నా బార్. మీది కాదు.”

“ఐదు రూపాయల స్టాంప్ పేపర్...... నాన్ జ్యూడీషియల్ పేపర్... ఏ బికారీ డబ్బిచ్చినా ప్రభుత్వం అమ్ముతుంది. అరవైయేళ్ళు దాటాక అ... ఆ... లు నేర్చుకొనే వ్యక్తయినా దానిమీద, ఆరుకోట్లు అపోలో హాస్పిటల్ కొంటున్నాను. కొన్నాను. అని

కూడా రాసి అపోలో హాస్పిటల్ మెయిన్‌గేట్ ముందు పడేసి వెళ్ళినంతమాత్రాన అది రౌడీ స్వంతం అయిపోదు. ఆ ఆరుకోట్లు చెల్లించాలి. అర్థమయిందా చిన్ని నాన్నా......" మేనేజర్ కవ్వింపుగా అన్నాడు.

"నీ జీవితంలో తెల్లవారటాలు లేట్ అనుకుంటాను. కాని కృంగి పోవటాలు మాత్రం త్వరగానే సంభవిస్తాయి. ఈ రోజు ఉదయం ఐదు గంటలకే మా ఫైనాన్స్ సెక్రెటరీ ఆ డబ్బు తీసుకెళ్ళి మీ ఓనర్‌కి పే చేసి సంతకం తీసుకొని వచ్చారు. ఇంకా నీకు అందులోనే మేనేజర్‌గా ఉద్యోగం చేయాలని ఉంటే మర్యాదగా మాట్లాడటం నేర్చుకో. ఎందుకంటే ఇప్పుడు ఆ బార్‌కి యజమానిని నేను యూ.. ఓల్డు...జాకాల్.. హోల్డు యువర్ టంగ్........" మధుకర్ లైన్‌ని డిస్కనెక్ట్ చేసి తిరిగి నిద్రలోకి జారుకున్నాడు.

ఫోన్‌కి ఆవలఉన్న మేనేజర్‌కి ఒక్కక్షణం కాలు, చేయి ఆడలేదు.

గాలి స్తంభించి పోయినట్లుగా, జీవితంలో కొత్త అనుభవాలు, ఆశ్చర్యాల్ని, అద్భుతాల్ని మోసుకొస్తున్నట్లుగా దిగ్భ్రాంతికి గురయ్యాడు.

ఎదురుగా కనిపించిన ఆటో ఎక్కి బార్ అడ్రస్ చెప్పి పోనివ్వమన్నాడు.

మహతి తండ్రి రాజేంద్రప్రసాద్ కూడా ఓ మాదిరి వ్యాపారస్తుడే. రెండు మూడు వేరే వ్యాపారాలు కూడా వున్నాయి. అతనే ఆరోజు ఉదయం జరిగిన సంఘటన జీర్ణించుకోలేక పోతున్నాడు.

మాటా మాటా పెరిగి పౌరుషం కోసం పంతం కోసం తన బార్‌కి వచ్చిన ఒక యువకుడు పది లక్షలు ఖరీదు కూడా చేయని బార్‌ని ముప్పై లక్షలకు కొన్నాడు. ఇది నిజంగా నిజమేనా?

పాతిక లక్షలకు బార్‌ని కొని, ఐదు లక్షలు టిప్ ఇచ్చాడు....... ఇలాంటి నమ్మలేని నిజాలు అప్పుడప్పుడు, అక్కడక్కడ జరుగుతుంటాయంటే తనింత కాలం నమ్మలేక పోయేవాడు. కానిప్పుడు నమ్మకతప్పటం లేదు.

తన దగ్గరిప్పుడు పది లక్షలకి చెక్, ఇరవై లక్షల హార్డ్ క్యాష్ ఉంది. ఏమిటిదంతా? ఎలా జరిగింది? మూడు గంటల కాలమా! ఇరవై లక్షల లాభమా?

"మీరిలా, వాటినక్కడే పెట్టుకు కూర్చుంటే ప్రమాదం. వెంటనే ఆ ఇరవై లక్షల క్యాష్ వేరే చోటికి తరలించండి" అప్పుడే కాఫీ కప్పుతో వచ్చిన రాజేంద్రప్రసాద్ భార్య అంది.

రాజేంద్రప్రసాద్ చప్పున తేరుకున్నాడు.

*　　　　*　　　　*　　　　*

మేనేజర్ బార్ముందు ఆటో దిగుతూనే మరింత ఆశ్చర్యపోయాడు.

పదిమంది వర్కర్స్ ఒక వ్యక్తి ఆధ్వర్యంలో సీరియస్గా పని చేసుకుపోతున్నారు.

అప్పటికే మధువన్ బార్ పేరున్న నియాన్ లైట్స్ సైన్ బోర్డ్ని పీకి క్రింద పడేసారు.

అంటే ...... ఉదయం రాజేంద్రప్రసాద్గారికి డబ్బిచ్చి బార్ కీస్ కూడా తీసుకొని, వెంటనే పనిలోకి దిగిపోయారన్నమాట.

తన వాటా ఐదు లక్షలు.

తనకి టిప్గా ఇచ్చిన మరో పది లక్షలు.

అంటే తనిప్పుడు పది లక్షల హార్డ్ క్యాష్కి యజమాని అన్న మాట. ఆ ఆలోచనే అతనికి ప్రపంచాన్ని జయించినంత ఆనందాన్ని కలుగజేసింది.

వెంటనే అదే ఆటోలో రాజేంద్ర ప్రసాద్ ఇంటికి బయలుదేరాడు. ఆ బార్ మాజీ మేనేజర్.

*　　　　*　　　　*　　　　*

రాఘవేంద్ర నాయుడు.

దీ గ్రేట్ ఇండస్ట్రియలిస్ట్. తన తండ్రి తనకిచ్చిన కేవలం నాలుగు ఎకరాల పొలం పెట్టుబడితో అంచెలంచెలుగా, అనవరతపు శ్రమతో, పట్టుదలతో, అనుక్షణం పరుగులు తీస్తూ కేవలం ముప్పై సంవత్సరాల కాలంలో ఐదొందల కోట్ల ఆస్తుల్ని సొంతం చేసుకొనే స్థాయికి ఎదిగిన అనితర సాధ్యుడు రాఘవేంద్ర నాయుడు .

తణుకు ప్రక్కన రేలంగి అనే గ్రామంలో పుట్టి, కేవలం ఐదంటే, ఐదో తరగతి వరకే చదివిన ఒకప్పటి రఘు....... రాఘవేంద్ర.... మూడు పదుల సుదీర్ఘ ప్రయాణం తరువాత, తన పూర్తి పేరును నిజంగానే న్యాయం చేకుర్చుకున్న లివింగ్ లెజెండ్..... రాఘవేంద్ర నాయుడు ఆయన జపాన్‌లో పర్యటిస్తున్న సందర్భంలో జరిగిన సంఘటన అది.

మోడరన్ మెడికల్ సైన్స్‌కి సవాల్‌గా వాళ్ళ వంశంలో ఒక్కరే జన్మిస్తుంటారు. రాఘవేంద్ర నాయుడు ముత్తాతకు రాఘవేద్ర నాయుడి తాత ఒక్కరే సంతానం. ఆ తాతకు తన తండ్రి ఒక్కరే సంతానం. తన తండ్రికితనొక్కడే. తనకీ మధుకర్ ఒక్కడే. ఆ మధుకర్ కి ఒక్కరే పుడతారా? అనే ప్రశ్న రాఘవేద్ర నాయుడు దంపతుల్ని కొన్నివేల సార్లు ప్రశ్నించి ఉంటుంది.

తమ వంశంలో రెండో సంతానానికి అవకాశం లేదని నిర్ధారించుకోవటం మూలంగానో... పెరిగిపోతున్న కోట్లాది సంపద పరులకు దక్కకూడదనో గాని రాఘవేద్ర నాయుడు కి కొడుకు మధుకర్ అంటే ప్రాణం కంటే ఎక్కువ. తమ ఎదిగిన ఎత్తులకన్నా ఎక్కువ. తను పాటించే వ్యాపార ధర్మాలకంటే ఎక్కువ.

చిన్నబాధ కూడా కొడుకు దరి చేరకూడదని తపిస్తుంటారు.

మధుకర్ కి ఏ చిన్న కష్టం కలిగినా తట్టుకోలేడు.

ఆ కష్టం కలిగించిన వార్ని క్షమించలేడు.

ఆ విషయం ఆయన క్రింద పనిచేసే ఉన్నతోద్యోగులు సయితం రాఘవేద్ర నాయుడు కన్నా మధుకర్ కే ఎక్కువ భయపడతారు.

రాఘవేద్ర నాయుడు తమ నుంచి వర్క్‌నే ఆశిస్తాడు. ఫలితాల్ని ఊహిస్తాడు. నీతీ నిజాయితీల్నీ కోరుకుంటారు. అందుకే ఆయన ఆశించినట్లు ఉండగలిగితే చాలు- మిగతా విషయాలు ఒకటి అటూ ఇటూ అయినా ఉపేక్షిస్తారనే ధైర్యం వుంది.

కాని, మధుకర్ విషయంలో అలా కాదు. ఎప్పుడు... ఎందుకు....... ఎలా ...... కోపగించుకుంటాడో.... రియాక్ట్ అవుతాడో ఊహించటం కష్టం.

అతను రాత్రి, అర్థరాత్రి దాటాక ఇంటికి చేరుకొని, ఆ మత్తులోనే ఫైనాన్స్ సెక్రెటరీకి ఫోన్ చేసి, నిద్రలేపి, ముప్పై లక్షలకు మధువన్ బార్ కొనమన్నప్పుడు అతను ముందు షాక్ తిన్నాడు. తేరుకొని కొద్ది క్షణాలు ఆలోచించాడు. అయినా వేరే మార్గం కనిపించక ఆ తెల్లవార్లూ ఇరవైలక్షల హార్డ్ కేష్ కలెక్షన్ లోనే గడిపాడు. ఎంత బిజినెస్ మెన్ అయినా ఎవరు మాత్రం లక్షలకు లక్షలు హార్డ్ కేష్‌ని దగ్గరుంచుకుంటారు?

పైగా రాత్రి ఒంటిగంటనుంచి తెల్లవారేసరికి ఇరవై లక్షలు కేష్ కలెక్ట్ చేయటం. కష్టం కాకపోయినా ..... ఆడ్ టైమ్‌లో గనుక ఒకింత ఇబ్బందే అయింది. ఆ పనే చేసుండకపోతే నెలకు పదివేలు జీతం, కారు, కంపెనీ ఇచ్చిన డీలక్స్ క్వార్టర్స్, ఏసీ ఆఫీసు రూమ్, టివీలు, డిఏలు మొత్తం స్టేక్‌గా పెట్టవలసి వచ్చేది.

మధుకర్ ఆగ్రహం ఎన్ని ప్రమాదాల్ని, కష్టనష్టాల్ని తెచ్చిపెడుతుందో అనుగ్రహమూ అంతే లాభాన్ని,సుఖాల్ని , సంపదల్ని హోదాని తెచ్చి పెడుతుంది.

మధుకర్ విషయంలో ఏ పని చేయవలసి వచ్చినా, ఎవ్వరికీ చెప్పనక్కర్లేదు. చివరకు రాఘవేంద్రనాయుడు ధర్మపత్నికి కూడా.

మంచిదైనా, చెడుదైనా మధుకర్ కోరింది ముందు నెరవేర్చాలి. అక్కడితో మధుకర్ సంతృప్తి చెందుతాడు. ఆ పైన కొడుకు చేసిన పనిని సరిదిద్ది, అందుమూలంగా వచ్చిన నష్టాన్ని లాభంగా మార్చేవరకు రాఘవేద్ర నాయుడు నిద్రపోడు. తనక్రింద పనిచేసే వార్ని కూడా నిద్రపోనివ్వడని వారందరికీ తెలుసు.

ఆ రోజు ఉదయం పదిన్నరకు మధుకర్ ఇండ్రస్ట్రీస్ పదిహేను అంతస్తుల రిజిస్టర్డ్ ఆఫీసులో పనిచేసే వేలమంది సిబ్బంది మెదళ్ళల్లో ఒక్కటే ప్రశ్న పురుగులా తొలుస్తోంది.

పది లక్షల కూడ చేయని మధువన్ బార్‌ని. తమ  భవిష్యత్ యజమాని. అహంతో పొగరుతో ముప్పై లక్షలకు కొనిపించాడు. ఆ నష్టాన్ని తమ ప్రస్తుతపు యజమాని ఎలా పూరిస్తాడు? ఆ ప్రశ్న దగ్గరే వాళ్ళ  ఆలోచనలు స్తంభించిపోయాయి.

కాని వాళ్ళకు మాత్రం ఒకటి ఖచ్చితంగా తెలుసు- తను ఛైర్‌మన్ రాఘవేంద్ర నాయుడు జపాన్‌నుంచి రాగానే కేవలం గంటలోపే ఆ డీల్‌ని ప్రాఫిటబుల్‌గా మార్చివేస్తారు. అది ఖాయం కాని ఎలా?

అదే ప్రశ్నకి ఒకర్ని ఒకరు ప్రశ్నించుకోవటంలో లంచ్ టైమ్ అయిపోయిది తప్ప, సమాధానం తట్టలేదు.

సరిగ్గా అదే సమయంలో రాఘవేంద్ర నాయుడు ఇండియా వచ్చేందుకు జపాన్ ఎయిర్‌లైన్స్ ఆయన టిక్కెట్‌ని కన్‌ఫర్మ్ చేసింది.

*　　　*　　　*　　　*

జరిగింది తెలుసుకొని మధుకర్ తల్లి చాలా బాధపడింది. కొడుకు పంతం, పట్టుదల, మొండితనం, ఉక్రోషం ఎక్కడికి దారి తీస్తాయో-- ఏ అంచుకు విసిరివేస్తాయోనని మథనపడిపోయింది.

ఆ రోజు ఉదయానికి ఢిల్లీ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో దిగిన రాఘవేంద్ర నాయుడు ఎయిర్ పోర్టునుంచే ఇంటికి ఫోన్ చేశాడు.

ఆయన భార్య భువనేశ్వరి రెస్పాండ్ చేసింది. ఆమె జరిగిందంతా భర్తకు చెప్పి బాధ పడింది. జరిగింది తెలుసుకున్న  రాఘవేంద్ర నాయుడు పెద్దగా రియాక్టు అవ్వలేదు.

అందుకు ఆరు కారణాలున్నాయి.

ఒకటి: కొడుకు మనస్తత్వం ఎరిగుండటం.

రెండు: కొడుకు  ఏ తప్పు చేసినా క్షమించగలిగేంత ప్రేమని గుండెలనిండా నింపుకొని ఉండటం.

మూడు: తన తండ్రి మాధవరావు చనిపోయాక ఆ కుటుంబంలో పుట్టినవాడు తన కొడుకే గనుక, తన తండ్రే తిరిగి తన కొడుకుగా పుట్టాడని నమ్మి తండ్రి పేరే పెట్టుకోవటం.

నాలుగు: తను అనవరతం శ్రమించి సంపాదించిన అపార సంపదకు వారసుడు మధుకర్ ఒక్కడే కావటం.

ఐదు: మరి కొన్నాళ్ళకయినా మధుకర్ , తన బాధ్యతని తాను గుర్తించే స్థాయికి ఎదగగలడనే నమ్మకం ఉండటం.

ఆరు: కొడుకే నష్టం తెచ్చిపెట్టినా తను  దాన్ని లాభంగా మార్చగల వ్యాపార చాతుర్యం తనకుంది గనుక-రియాక్ట్ అవ్వలేదు.

వ్యాపారపరంగా చేతులు చూడకుండా జాతకం చెప్పగల శక్తి యుక్తులు నాయుడికున్నాయి. లక్షల నక్షత్రాల గొడుగు క్రింద ఎన్నో ఒంటరి రాత్రుల్ని గడిపిన దురదృష్టకరమైన అనుభవాలెన్నో ఇప్పుడాయన అభివృద్ధికి మెట్లుగా మారిపోయాయి.

కష్ట సుఖాలు-లాభ నష్టాలు-ఎత్తుపల్లాలు-శాంతి, అశాంతి-ప్రతి దాని రెండవమొఖాన్ని కూడా చూసి చూసి అలవాటై, అబ్సెషనయి చలించని స్థితికి చేరుకొని, దేనికయినా ఒకే విధంగా రియాక్ట్ అయ్యే స్థితికి ఎదిగిన రాఘవేంద్ర నాయుడుకి వచ్చిన నష్టం, కొడుకు ఆడుకున్న ఆటగానే అనిపించింది.

చిన్నప్పుడు బొమ్మలిచ్చాను--

వాటిని విరగ్గొట్టటమే ఆటనుకున్నాడు మా నాన్న. (కొడుకులో తన తండ్రిని చూసుకుంటాడు గనుక మధుకర్‌ని నాన్నా అంటాడు.)

ఎన్నో ఆటవస్తువులిచ్చాను. ఆడి పారేశాడు నాన్న. ఇప్పుడు పెద్దయ్యాడు- కనుకే కొంచెం పెద్ద ఆటలాడుకుంటున్నాడు. తప్పేముంది? తనకైనా తెలిసిరాక పోతుందా?

ఈ ప్రపంచంలో ఉన్నింట్లో పుట్టిన పిల్లలు ఎందరు ఎర్లీ ఏజ్ లోనే బాధ్యతల్ని గుర్తించారు? ఆక్వర్డు టీనేజ్! ఎక్స్క్యూజ్ చేయదగ్గ జీవితమే కదా?

చేయాలనుకున్న తప్పు మధుకర్ చేసినప్పుడు అప్పుడు తన తండ్రి కళ్ళల్లో కనిపించే ఆనందపు మెరుపులు పవర్‌ఫుల్ హాలోజెన్ లాంప్స్ కన్నా కాంతివంతంగా ఉంటాయి.

నాన్న- నీలో మా నాన్నను చూసుకుంటున్నాను. మా నాన్న చేతిలో పార గునపం తప్ప మరేమీ లేవు. అవే ఆయన ఆస్తి, ఆర్థర్ కాటన్ దొర ఆనకట్ట కట్టేముందు వరకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కరువు విలయతాండవం చేసేది.